నాలో పేరుకుపోయిన నాస్తిక భావాన్ని ఈ చిన్నసంఘటనతో మార్చివేసిన దైవలీల అద్భుతమే' అనుకున్నాడు శ్రీనివాసరావు.

శివయ్యతో కలిసి మల్లికార్జునుని పూజించాడు. భక్తితో తలనీలాలు సమర్పించుకున్నాడు. బోడిగుండుతో, శివప్రసాదంతో ఇంటికి వచ్చిన శ్రీనివాసరావును చూసి భార్య, తల్లి మొదట ఆశ్చర్యపోయినా, శ్రీనివాసరావులో కలిగిన పరివర్తనకు ఎంతో ఆనందించారు.అదీ, ఆనాటి నుండి 'తమసోమా జ్యోతిర్గమయ' కార్యక్రమాన్ని చూస్తున్నా ఈనాటి వరకు దేవుని పూజించనిదే కాలు బయటపెట్టడు శ్రీనివాసరావు.

**-టి.రామాంజనేయులు (హాలహర్వి)**

# స్నేహం

కమలమ్మ కాలు కాలిన పిల్లిలా ఆ గదిలోకి ఈ గదిలోకి వరండాలోకి తిరుగుతోంది. భర్త పోయి అప్పుడే ఆర్నెల్లయింది. ఉన్న ఇద్దరు పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేసింది. అమ్మాయి బెంగళూరులో వుంటోంది. అబ్బాయి సుధాకర్ హైదరాబాదులో ఉద్యోగం చేసుకుంటున్నాడు.

రెండ్రోజుల్లో సుధాకర్ తనని తీసుకొని సిటీకి పోతానని జాబు రాశాడు. ఇప్పుడు అదే పెద్ద సమస్యగా వుంది. ఇన్నాళ్ళు స్వతంత్రంగా బ్రతికింది. భర్తపోయాక తాను ఒంటరిదైపోయింది. ఇంక సుధాకర్‌తో పోక తప్పదు.

కమలమ్మకు చాలా బాధగా వుంది. ఇన్ని సంవత్సరాలు స్వేచ్ఛగా వుండి, ఎంత కొడుకైనా ఏదో సంకోచ భావం కదలాడుతోంది. ఆ ఇంటిని, ఆ వస్తువుల్ని వదలి పోవాలంటే తల్చుకుంటేనే దుఃఖం వస్తోంది.

సుధాకర్ రానే వచ్చాడు. తనని సిటీకి తీసుకుపోయాడు. కోడలు సునీత మాత్రం ముభావంగానే వుంది. 'ఈమెను జీవితాంతం భరించాలి కాబోలు' అన్న భావమే సునీతలో కనపడుతోంది.

డైనింగ్ టేబిల్ దగ్గర అందరూ ముభావంగానే భోజనాలు కానిచ్చారు. తను లేకుంటే ఇద్దరూ సరదాగా కూర్చుని భోంచేసేవాళ్ళేమో! తనవల్ల వాళ్ళకి ఇబ్బందిగా వుందని మాత్రం గ్రహించగలిగింది. పిల్లలు సింధు ఫిఫ్త్‌క్లాస్, సాకేత్ ఫోర్త్‌క్లాస్ చదువుతున్నారు. వాళ్ళకి తన దగ్గర ఎక్కువ అలవాటు లేనందున దూరంగానే ఉంటున్నారు.

పిల్లలు ఉదయం ఎనిమిది గంటలకు స్కూల్‌కి వెళితే ఇంక రాత్రి ఏడు గంటలకే వచ్చేది. సుధాకర్ ఆఫీసుకి, పిల్లలు స్కూల్‌కి వెళ్ళిపోతే ఏమీ తోచేది కాదు. సునీత బెడ్ రూంలోకెళ్ళి తలుపేసుకునేది. అంతే ఇక్కడ తనకు ఒంటరితనమే.

వీధిలోకొచ్చి చూసింది. రోడ్లో తిరిగే జనం తప్ప ఇక్కడ ఇరుగు పొరుగు కూడా ఎక్కువ మాట్లాడుకోరు కాబోలు అనుకుంది. ప్రక్కన ఇల్లయితే 'టు లెట్' బోర్డుతో తాళం వేసుంది. కమలమ్మకు ఏం తోచక లోపలికొచ్చి అలాగే నిస్త్రాణంగా పడుకొనుండిపోయింది.

మూడు నెలలకే కమలమ్మ మనిషి సగమైపోయింది. డాక్టర్ దగ్గరకెళితే జబ్బేం లేదని నీర్సానికి మందులు రాసిచ్చాడు.

ఆరోజు ఆదివారం. బయట ఏదో లారీ ఆగిన శబ్దం సామాన్లు దించుతున్న శబ్దం వినపడింది. కమలమ్మ బయటికొచ్చి చూసింది. ఎవరో పక్క ఇంట్లో అద్దెకు దిగుతున్నారు. సుధాకర్ ఇంట్లోనే వుండటంతో లోపలికొచ్చేసింది.

రెండు రోజుల తరువాత ఇంచుమించు కమలమ్మ వయసున్నామె లోపలికొచ్చింది. "ఏమండి" అంటూ పిలిచింది.

సునీత "ఎవరు కావాలి?" అడిగింది.

"మేము ప్రక్కింట్లో అద్దెకు దిగాము. మా అబ్బాయి బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇక్కడ అందర్నీ పరిచయం చేసుకొందామని మొదటగా మీ ఇంటికి వచ్చాను" అంది.

ఆమెను కొద్దిగా ఆశ్చర్యంగానే చూసింది సునీత. ఇక్కడ ఎవరికి వారే ఉంటారు. అందులో ఈ గల్లీలో ఇద్దరు తమిళియన్స్, సింగ్‌లు, ఎవరెవరో వున్నారు. తెలుగు ఫ్యామిలీస్ తక్కువే.

"రండి కూర్చోండి" అంటూ సునీత కుర్చీ చూపించింది.

లోపల్నుండి కమలమ్మ వచ్చింది.

"ఈమె మా అత్తగారు" పరిచయం చేసింది.

"మాది కాకినాడ దగ్గర పల్లెటూరు. మా అబ్బాయి ఉద్యోగం మీద అన్ని ఊళ్లూ తిరగక తప్పటం లేదు" కొద్దిగా బాధ మేళవింపుతో అంది.

"నా పేరు కమలమ్మ. మాది పల్లెటూరే. కానీ మా అబ్బాయికి ఇక్కడ ఉద్యోగం వుంది గనుక మేము ఇక్కడకు వచ్చాము" అంది కమలమ్మ.

"కాఫీ తెస్తాను" సునీత లోపలి కెళ్ళింది.

"నా పేరు సరోజిని" అంది వచ్చినామె.

సరోజిని, కమలమ్మ ఇద్దరు మాటల్లోనే కలిసిపోయారు. సునీత కాఫీ ఇస్తే త్రాగిన సంగతి కూడా తెలియలేదు.

సరోజిని "ఇంక వస్తాను. అబ్బాయి వస్తాడు" అంటూ లేచింది.

"అప్పుడప్పుడు వస్తూండండి" అంది కమలమ్మ.

"మాది ప్రక్కిల్లే కదా! వస్తాలే" అంటూ వెళ్ళిపోయింది.

ఆరోజు కమలమ్మ కొద్దిగా ఉత్సాహంగానే వుంది. తనతో నోరార ఓ మనిషి మాట్లాడిన తృప్తి కానవస్తోంది. సునీత మాత్రం ముభావంగానే ఉండిపోయింది.

సరోజిని వాళ్ళబ్బాయి బ్యాంకుకు పోగానే కమలమ్మ దగ్గరకొచ్చేది. సుధాకర్, పిల్లలు ఉదయం ఎనిమిదిన్నరకల్లా వెళ్ళిపోయేవారు. సునీత ఏదో షాపింగ్, పనులమీద బయటికెళ్ళిపోయేది. అప్పుడు సరోజిని రావటం సంతోషంగా వుండేది.

ఇద్దరూ ఎన్నో విషయాలు మాట్లాడుకునే వారు. తమ పల్లెల్లో, పట్టణాల్లో, ఎంత వ్యత్యాసాలో అని బాధపడేవారు. త్వరలోనే ఇద్దరు మంచి స్నేహితురాళ్లైపోయారు.

మధ్యాహ్నం ఇద్దరూ ఒకరింట్లో ఒకరికి సహాయంగా పిల్లలకు కావలసిన జంతికలు, బజ్జీలు, పూరీలు కలిసి చేసేవారు. కోడళ్ళు వద్దన్నా ఏదో కాలక్షేపం అనేవారు.

ఎండాకాలంలో ఇద్దరూ కలిసి వడియాలు, ఊరగాయలు పెట్టారు. ఇప్పుడు కమలమ్మకు ఎంతో ఉత్సాహంగా వుంది. మునుపటిలా నీర్సం లేదు. కొద్దిగా ఒళ్ళు కూడా చేసింది. తనకు తోడుగా తనతో మాట్లాడుతూ కలిసి పనిచేసే స్నేహితురాలు దొరికినందుకు ఆనందంగా వుంది. 'సిటీ'లో ఇంత బాగుంటుందా! అన్పించింది. సరోజినమ్మకు కూడా అలాగే వుంది.

వాళ్ళ పిల్లలు, వీళ్ళ పిల్లలు కల్సిపోయారు. స్కూల్ కూడా ఒకటే. పెద్దవాళ్ళు ఎక్కడికైనా వెళితే వీళ్ళిద్దరి దగ్గర పిల్లల్ని ధైర్యంగా వదిలేసి పోయేవారు.

వీధి చివరి సాయిబాబా మందిరానికి సరోజిని, కమలమ్మ కలిసి వెళ్ళేవాళ్ళు. తమ బాధలు, అనుభవాలు, కలిసి పంచుకొనే వారు. తమ పెళ్ళైన కొత్తలో ముచ్చట్లన్నీ చెప్పుకునే వారు.

సరోజినమ్మ కోడలు స్రవంతి, సునీత మాత్రం ఎక్కువగా మాట్లాడుకునే వారు కాదు. ఎందుకో వారిద్దరి మధ్య అంతస్థు భేదం ఉండేది. ఎదురుగా కనపడినప్పుడు పొడి పొడిగా మాట్లాడుకునే వాళ్ళు.

ఓసారి కమలమ్మకు జ్వరం వస్తే సరోజినమ్మ ఎంతో సేవ చేసింది. సొంత అక్కా చెల్లెళ్ళకన్నా తనకు ఎంతో సేవ చేసిందని పొగిడింది. "రేప్పొద్దున్న నాకేదైనా వస్తే నీవు చేస్తావు గదా! మనలో మనకు ఎందుకు పొగడ్తలు" అంది. దాంతో ఇద్దరి స్నేహబాంధవ్యం ఎక్కువైపోయింది.

ఉన్నట్టుండి ఓరోజు పిడుగులాంటి వార్త. సరోజినమ్మ కొడుక్కి 'ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్' వచ్చాయని. అప్పుడే మూడు సంవత్సరాలు మూడు నిమిషాల్లా గడిచి పోయాయా అనుకొంటూ ఎంతో బాధపడింది కమలమ్మ.

ఆరోజే మంచం ఎక్కింది కమలమ్మ. బయట లారీలో సామాన్లు చేరవేస్తున్న శబ్దం వస్తున్నా, పొంగుతున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ అలాగే వుండిపోయింది.

**-అనూరాధ రామకృష్ణ (నెల్లూరు)**